క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నర్సీపట్నం: న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎంయు ఎంప్లాయీస్ రెడ్ బ్యాడ్జీలు ధరించి శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు జి.ఎస్.నారాయణ మాట్లాడు తూ కండక్టర్లు, డ్రైవర్లకు అలవెన్సులు ఇప్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఆర్జిత సెలవుల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అంత్యక్రియుల ఖర్చుకు ఇచ్చే రూ.25 వేలు ట్రెజరీ ద్వారా చెల్లించాలన్నారు. 2022–23 లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, పెండింగ్ ఇంక్రిమెంట్లు వెంటనే చెల్లించాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పతకాలు సాధించిన విద్యార్థుల కోలాహలం

నర్సీపట్నం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని నింపుతాయని శ్రీవిద్యాంజలి హైస్కూల్ చైర్మన్ అక్షజ్‌కృష్ణ, కరస్పాండెంట్ శాంతి పేర్కొన్నా రు. నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ స్టేడియంలో కురుక్షేత్ర పేరిట పోటీలను ఘనంగా నిర్వహించారు. హౌస్ కెప్టెన్స్, వైస్‌కెప్టెన్స్ ప్రమాణస్వీకారం చేశారు. అగ్ని, పృథ్వి, వరుణ, వాయు పేరిట హౌస్ విద్యార్థులు ప్రదర్శించిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. ఆటల్లో విజేతలకు కరస్పాండెంట్ మెడల్స్ బహుకరించారు. చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాల వితరణ

కె.కోటపాడు: కళాశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థినులు చదువుల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, ఉద్యోగాలు పొందాలని చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ సన్యాసిరావు అన్నారు. కె.కోటపాడులో గల ఎస్.సీ కళాశాల బాలికల వసతిగృహంలో గల విద్యార్థినులకు ట్రస్ట్ ద్వారా గురువారం రాత్రి నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో మంచి ప్రతిభను చూపాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ అధికారి నాగలక్ష్మి, రిటైర్డ్ జిల్లా కోర్టు జడ్జి డి.సుందరరావు, అడ్వకేట్ బెనర్జీ పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



కమిషనర్ సురేంద్రకు భగవద్గీతను బహూకరిస్తున్న బీజేపీ నాయకులు

నర్సీపట్నం: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జంపా సురేంద్రను బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. భగవద్గీతను కమిషనర్‌కు బహుకరించారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు కాళ్ళ సుబ్బారావు, చిందాడ నూకేశ్వరరావు, పాకలపాటి అరవింద్‌రాజు, బీజేవైఎం నాయకులు అడిగర్ల సతీష్, సత్యనారాయణ, వరహాలబాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ర్యాలీ

మాడుగుల రూరల్ : సమాజాన్ని పట్టి పీడిస్తున్న హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా వీటిని ప్రారదోలవచ్చునని, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సి.యల్.డబ్ల్యు ఉద్దిప పేర్కొన్నారు. శుక్రవారం చీడికాడ మండలం బైలపూడి గ్రామంలో ఈ కార్యక్రమంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ వితరణ

కె.కోటపాడు : కింతాడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు గొర్లి నరేష్‌కు కూండ్రపువానిపాలేనికి చెందిన సత్యసాయి భజన మండలి కన్వీనర్ కన్నూరు చెల్లిబాబు వీల్ చైర్‌ను సమకూర్చడం అభినందనీయమని కె.కోటపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ జూరెడ్డి రాము అన్నారు. సత్యసాయి మందిరంలో వీల్ చైర్‌ను నరేష్‌కు శుక్రవారం అందించారు. సత్యసాయి భక్తులు అప్పలనాయుడు, నారాయణపాత్రుడు, భీమేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్.. మరమ్మతులు నిల్

- భవనం శ్లాబ్ పెచ్చులూడుతున్న వైనం.
- పలు చోట్ల ఛిద్రమైన గచ్చులు, కిటికీలు, ద్వారబంధాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

కె.కోటపాడు: కొరువాడ గ్రామంలో గల బీసీ బాలుర వసతిగృహం బలహీనంగా మారింది. వసతిగృహంలో గల 8 తరగతి గదులతో పాటు వంట గదుల్లో శ్లాబ్ వెంట పెచ్చులూడిపతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో శ్లాబ్ వెంట పెచ్చులు రాలిపడడంతో ప్రమాదాలు ఏమైనా చోటుచేసుకుంటాయోమనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహంలో మూడు నుంచి పదో తరగతికి చెందిన 44 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు ఉండే గదులన్నీ పెచ్చులూడడం వల్ల వర్షాల సమయాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వసతిగృహంలో గచ్చులు కుడా పలు చోట్ల ఛిద్రమయ్యాయి. భవనాలకు గల కిటికీలు, ద్వారబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వసతి సదుపాయాలు సరిగా లేకపోవడం వల్ల చదువుల్లో విద్యార్థులు ఏకాగ్రత చూపలేకపోతున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థులను ఇక్కడ చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ ప్రభావం అడ్మిషన్‌లపై పడుతుంది. వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతిగృహానికి పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వంట గదిలో పెచ్చులూడిన భవనం శ్లాబ్



కొరువాడ బీసీ బాలుర వసతిగృహం

వర్షాలు పడినపుడు ఇబ్బందులు



వసతిగృహంలో ఉన్న గదులతో పాటు వంట గది నుండి శ్లాబ్ పెచ్చు లూడుతుంది. ఎప్పుడు ఏ పెచ్చులు పడి ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందోనని మాకు భయంగా ఉంది. పెద్ద వర్షాలు పడే సమయాల్లో పెచ్చులూడిన శ్లాబ్ ప్రాంతం నుంచి వర్షపునీరు గదుల్లోనికి వస్తుంది. దీంతో విద్యార్థులంతా ఇబ్బంది పడుతున్నాం. మరమ్మతులు చేపట్టాలి.

– విశాల్ మురళి, వసతిగృహ విద్యార్థి, కొరువాడ

వరినాట్లకు తీరిన నీటి కొరత

చోడవరం: తుఫాను వర్షాలతో పంట పొలాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. వరినాట్లు వేసేందుకు ఖరీఫ్ సీజన్ గడువు ముగుస్తుండడంతో ఈ వర్షాలు రైతులకు చాలా మేలు చేశాయి. మూడు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురిసినప్పటికీ శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా ఓ మోస్తరు వర్షం కురవగా మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. 30 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మెట్టప్రాంతాల్లో మందకొడిగా సాగుతున్న వరినాట్లు పనులు ఈ వర్షంతో జోరందుకున్నాయి. జోరువానలోనూ చోడవరం పరిసర ప్రాంతాల్లో అనేక పొలాల్లో వరినాట్లు వేశారు. ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో రోడ్లపై వర్షపునీరు పొంగి ప్రవహించగా పొలాల్లో నీరు చేరింది. దీంతో దమ్ములు పట్టి వరినాట్లు వేసేందుకు సిద్ధంగా ఉంచిన పొలాలన్నీ వర్షం నీరు చేరడంతో దమ్ములు పట్టి నాట్లు వేసేందుకు అనుకూలంగా మారింది. రైతులంతా ఆనందం వ్యక్తం చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలో రెండు రోజులుగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. జోరు వానలతో ఎర్రవాయి గ్రామాల్లో వర్షం నీరు చేరింది. మల్లాం, భీమవరం, శివరాంపురం, రాజాం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, కరక, చిట్టియ్యపాలెం, సీతయ్యపేట, తురకలపూడి తదితర గ్రామాల్లో పంట పొలాల్లో వర్షం నీరు చేరుతుంది.సాగునీటి సదుపాయం లేని ఎర్రవాయి గ్రామాల రైతులకు వర్షం మేలు చేసింది.



దిబ్బిడిలో వర్షంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

పొలాల్లో వర్షం నీరు చేరడంతో ఎర్రవాయి గ్రామాల రైతులు దమ్ములు చేసి వరినాట్లుకు సిద్ధమయ్యారు. నెలాఖరులోగా వరినాట్లు వేయకపోతే ఆకులు ముదిరిపోయి పంట దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ముమ్మరంగా వర్షంతోనే వరినాట్లు వేస్తున్నారు.

900 హెక్టార్లలో వరినాట్లు పూర్తి

మాకవరపాలెం: మండలంలో ఇప్పటివరకు 900 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని ఏవో చిరంజీవి తెలిపారు. ఏటా మండలంలో వర్షాలు అనుకూలిస్తే ఖరీఫ్ సీజల్లో సాధారణ విస్తీర్ణం అయిన 1291 హెక్టార్లలో నాట్లు జరుగుతాయన్నారు. ఇప్పటివరకు 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 900 హెక్టార్లలో నాట్లు పూర్తికాగా ప్రస్తుతం కురుస్తు న్న వర్షాలకు మరో 250 హెక్టార్ల వరకు నాట్లు జరిగే అవకాశం ఉందన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు నాట్లు వేసిన వరి పొలాలకు కూడా అనుకూలమన్నారు.

ఎం.కొత్తపల్లి విద్యాకమిటీ చైర్మన్‌గా రమణ

చోడవరం: మండలంలో నంబారువానిపాలెం (ఎం. కొత్తపల్లి) స్కూల్ విద్యా కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన నంబారు రమణ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. గంధవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఎం.కొత్తపల్లి ఎంపీపీ స్కూల్‌కు ఈనెల 17వ తేదీన ఎన్నికలు జరగాల్సి ఉండగా స్థానికంగా ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదంతో ఎన్నికను అప్పట్లో వాయిదా వేశారు. దీంతో ఈ పాఠశాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల విద్యాకమిటీకి మొత్తం 13 డైరెక్టర్లుకు ఎన్నికలు జరగ్గా 8 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, ఐదుగురు టీడీపీ, జనసేన కూటమి మద్దతుదారులు గెలిచారు. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికలను ఇరువర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 8 మంది డైరక్టర్లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలవడంతో చైర్మన్‌గా నంబారు రమణ, వైస్ చైర్మన్‌గా మొల్లి సత్యవతి ఎన్నికయ్యారు. మండల విద్యాశాఖాధికారి సింహాచలం పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన వారిని డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ, యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ మొల్లి ప్రసాద్, నంబారు నాగన్న, మోసూరి శ్రీనివాసరావు అభినందించారు.



ఎన్నికైన స్కూల్ కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్, నాయకులు

గంబూషియా చేపలతో దోమల నివారణ

- మురుగునీరు, చేపల పెంపకం లేని చెరువుల్లో విడుదల
- లార్వాను తినే గంబూషియా చేప

కె.కోటపాడు : గంబూషియా చేప పిల్లలను నిల్వ నీటి ప్రాంతాలతో పాటు చేపలను పెంచలేని చెరువుల్లో వేయడం దోమలు లేకుండా చేయవచ్చునని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు అన్నారు. సింగన్నదొరపాలెం, గొందుపాలెం గ్రామాల్లో చేపల పెంపకం లేని చెరువుల్లో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా గంబూషియా చేప పిల్లలను వైద్య సిబ్బంది కలిసి ఆయన శుక్రవారం వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గంబూషియా చేప పిల్లలు లార్వాను తినడం వల్ల దోమల వృద్ధి జరిగే పరిస్థితి ఉండదని అన్నారు. తద్వారా ఎపిడమిక్ సీజన్‌లో ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తుగా ఇటువంటి చర్యలను తీసుకుంటున్నట్లు డి.ఎస్.ఎన్.రాజు అన్నారు. కింతాడ గ్రామంలో వాడుకలో లేని బావులలో గంబూషియా చేప పిల్లలను హెల్త్ సూపర్‌వైజర్ రమేష్‌నాయుడు, ఏఎన్ఎం.నాగమణి విడుదల చేశారు.

రోలుగుంట : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం దోమలు నివారణకు వినియోగించే గంబూసియా చేపలు విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ కె.వరహాలుతో కలసి వైద్యాధికారి కె.ధనలక్ష్మి ప్రారంభించారు. దీనిలో భాగంగా స్థానిక శ్రీవిజ్ఞాన్ కాన్వెంటు సమీపంలో గల నిల్వనీటి బావిలో ఈ చేపలను విడుదల చేశారు. వీటి వినియోగం ద్వారా దోమల నియంత్రణ గురించి వైద్యాధికారి ధనలక్ష్మి తెలియజేశారు. దోమలే వీటి ఆహారం. ఈ వర్షాకాలంలో దోమల ఉధృతి, వాటి కాట్ల వల్ల విజృంభించే రోగాల నియంత్రణకు తమ శాఖ ఈ చేపలతో ప్రయోగం చేసి వీటిని వినియోగంలోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం వైద్యాధికారి విలేకరులతో మాట్లాడితూ పీహెచ్‌సీకి 2000 చేపలు వచ్చాయని, వీటిని బావులు, నీటి కుంటలతో పాటు దోమల ఉధృతికి ఆస్కారం ఉన్న 20 చోట్ల తమ సిబ్బంది విడుదల చేశారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో కృష్ణ , ఏఎన్ఎం సత్యవతి ఆశా పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : విషజ్వరాల అదుపునకు దోమల నివారణకు గంబూషియా ఫిష్ మురుగుకుంటలో విడుదల చేసినట్టు చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ తెలిపారు. జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు సబ్ యూనిట్ పరిధిలో గల 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో శుక్రవారం వీటిని విడుదల చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో ఎం.కోటపాడు పాచిలి వారి కళ్లాలు వద్ద గల నివాస గృహాల పక్కన మురుగుకుంటలో, ఎం.కె.వల్లాపురం గ్రామంలో, ఘాట్ రోడ్డు జంక్షన్‌లో మురుగు కుంటలో గ్యాంబూషియా ఫిష్‌ను విడుదల చేశారు.

కింతలి పీహెచ్‌సీ పరిధిలో గల గ్రామాల్లో కూడా వీటిని వేసారు. కార్యక్రమంలో కె.జె.పురం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ప్రసాదు పాత్రుడు, వైద్యాధికారి కె.లీలాప్రసాదు, ఎం.కోటపాడు, వల్లాపురం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు శానాపతి శేష ఫణి, కోట్ని లక్ష్మి, శానాపతి గంగాధర్, కరణం రాము, ఆరోగ్య పర్య వేక్షలు వెంకట్రావు, సహాయకులు శంకర్, ఏఎన్ఎం పుష్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



గొండుపాలెం చెరువులో గంబూషియా చేప పిల్లలను వేస్తున్న డీఎస్ఎన్ రాజు

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలి

నాతవరం: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. నాతవరం పీహెచ్‌సీలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం ఎం.రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి వేళల్లో నైట్‌వాచ్‌మన్ లేక తరుచూ పీహెచ్‌సీలో చోరీలు జరుగుతున్నాయన్నారు. పాత పీహెచ్‌సీ భవనంలో రెండు రోజుల క్రితం ఫ్యాన్లు , ఇతర సామాగ్రి చోరీకి గురయ్యాయన్నారు. నైట్‌వాచ్‌మన్ లేక ఇబ్బందులు పడుతున్నామని వైద్యాధికారి రాజేష్ నాయుడు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో పలు అభివృద్ధి పనులతో పాటు నైట్‌వాచ్‌మన్‌ను నియమించేందుకు తీర్మానించారు, పీహెచ్‌సీలో చోరీ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న నాతవరం సర్పంచ్ గొలగాని రాణీ పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ ఎస్ఎంసీ ఎన్నికలు

మాకవరపాలెం: ఎస్ఎంసీ ఎన్నికలు పోలీసు బందోబస్తు నడుమ జరిగాయి. బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో ఈ నెల 17న నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో వివాదం ఏర్పడడంతో 8వ తరగతి నుంచి డైరెక్టర్ల ఎన్నిక వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల అనుమతితో వారి తల్లిదండ్రులను లోనికి అనుమతించారు. ముందుగా 8వ తరగతి డైరెక్టర్ల ఎన్నికల నిర్వహించిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల జరిపారు. చైర్మన్‌గా ఉపమాక మరిడియ్య, వైస్ చైర్మన్‌గా గనిశెట్టి లక్ష్మి ఎన్నికయ్యారు. ఎస్‌బి సిఐ గణేష్, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు ఆధ్వర్యంలో మరో పది మంది సిబ్బందితో పాఠశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



విద్యార్థుల అనుమతితో తల్లిదండ్రులను లోపలికి పంపిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు

మాడుగుల ఎస్ఐగా నారాయణరావు

మాడుగుల : మాడుగుల ఎస్ఐ గా జి.నారాయణరావు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మను దర్శించుకున్నారు. అక్కడ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు ఆలయ సిబ్బంది ఎస్ఐ నారాయణరావుకు ఘన స్వాగతం పలికి అమ్మవారి మెమెంటో అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మోదకొండమ్మ ఆశీస్సులతో శాంతి భద్రతలు కాపాడడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

దేవరాపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని దేవరాపల్లి ఎంపీడీవో కె. చంద్రశేఖర్ అన్నారు. తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుకుల విద్యాలయ ఆవరణలో ఉపాధి హామీ మాడుగుల క్లస్టర్ ఏపీడీ బి. శ్రీనివాస్, ఏపీవో ఎం. చంద్రకళ, గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్‌లతో కలిసి కొబ్బరి, మునగ, నిమ్మ, జామ, సపోట తదితర మొక్కలు నాటారు. జీవ కోటి మనుగడకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి మానవహారంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పాటేల ఈశ్వరమ్మ పాల్గొన్నారు. కాశీపురం హైస్కూల్లో వనమహోత్సవంలో భాగంగా ఎంఈవో–2 వి. ఉషారాణి మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో వనమహోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు సుజాత, రామలక్ష్మి, రాము, మాధవి, సూర్య, రాంబాబు, సీఆర్‌పీ రమణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ

మాడుగుల: మొక్కలు పెంపకం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని, ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాలుష్యం మహమ్మారిని తరిమికొట్టాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ పందర్భంగా ప్రతి సచివాలయ పరిధిలో సుమారు 200 మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్‌డీ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. హెచ్.ఎం.శెట్టి మోహన్‌రావు, వృక్షమిత్ర సమితి అధ్యక్షుడు అప్పనరాంబాబుతో కలసి మొక్కలు నాటి, విద్యార్థులతో నాటించారు. విద్యార్థులతో మొక్కలు నాటుదాం..పరిరక్షిద్దాం..అంటూ ప్రతిజ్ఞ చేయించారు.

కె.కోటపాడు : వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం, సచివాలయం ప్రాంగణాల్లో ఎంపీడీవో అప్పలరాజు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు నాటిన ప్రతి మొక్కను పెంచడాన్ని బాధ్యత గుర్తించాలన్నారు. ఏపీఎం వెంకటలక్ష్మి, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సురేష్, కుమార్, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

గొలుగొండ: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కృష్ణదేవిపేట రేంజ్ పరిధి ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం మొక్కలు నాటారు. రేంజర్ వెంకట రమణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మొక్కలు నాటడం వల్ల పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, సెక్షన్ అధికారి లక్ష్మణ్‌తో పాటు నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర, మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం రాము ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు లోవరాజు, నారాయణరావు, సంతోషి పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : ప్రతి ఒక్కరూ చెట్లు పెంపకాన్ని బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. వన సంరక్షణ మహోత్సంలో భాగంగా ఐయితంపూడి గ్రామంలో ఆయన శుక్రవారం ప్రభుత్వ స్థలాలు,పాఠశాలలు వద్ద ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. విచక్షణ రహితంగా చెట్లు నరకడాన్ని వ్యతిరేకించి మొక్కలు నాటడాన్ని అలవర్చుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ పెద్దాడ నాయుడు,ఎంపీటీసీ దేవర అప్పారావు,ఏపీవో మురళి తపాల్గొన్నారు.

నర్సీపట్నం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ జన్మదిన, వివాహ పర్వదినాల సందర్భంగా మొక్కలు నాటాలన్నారు. పాఠశాలలు, కళాశాల అవరణల్లో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో రేంజర్ లక్ష్మీనర్సు, కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.వి.పద్మావతి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



కాశీపురం హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 ఉషారాణి



కుసుర్లపూడి జెడ్పీ స్కూల్లో మొక్కలు నాటుతున్న హెచ్ఎం మోహన్‌రావు



మాడుగులలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు



మొక్కలు నాటుతున్న అటవీశాఖ సిబ్బంది



నాటిన మొక్కకు నీళ్లు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



తూటిపాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సీపీఎస్ రద్దు కోరుతూ విద్యాశాఖ మంత్రికి వినతి

నర్సీపట్నం: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ పీఆర్‌టీయు నాయకులు విశాఖలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. జీవో నెంబరు 117ని వెంటనే రద్దుచేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో 2023లో జరిగిన బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో నెం.84ను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రమోషన్ కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని గోపీనాథ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

కె.కోటపాడు : శ్రావణమాసం నాలుగో శుక్రవారం కావడంతో మండలంలో పలు గ్రామాల్లో గల దుర్గాదేవి ఆలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పూజలు జరిపారు. చౌడువాడ, పింద్రంగి, గుల్లేపల్లి, ఎ.కోడూరు గ్రామాల్లో గల దుర్గాదేవి ఆలయాలతో పాటు కె.కోటపాడులో గల కామాక్షమ్మ అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు జరిపారు.

సంతోషిమాత ఆలయంలో..

మాడుగుల రూరల్: ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుమారు వెయ్యి మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. కళిరెడ్డి అప్పలనాయుడు కుటుంబ సభ్యుల సౌజన్యంతో భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షించారు. భక్తుల కోసం వేగి రాము ఆర్థిక సహకారంతో ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు.

సామూహిక కుంకుమ పూజలు

మాడుగుల రూరల్: నాలుగో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని, మాడుగుల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘునాథచార్యుల చేతుల మీదుగా పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు చేరింది. దీంతో పాటు జలాశయాలల్లో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. తాచేరు, శారద, నదుల్లో వర్షపు నీరు చేరింది. ఈ వర్షాలకు మెట్ట భూముల్లో వేసిన వరి నాట్లకు ఎంతో మేలు కలుగుతుందని రైతులు తెలిపారు.